# పుష్పకం

ఆనాడు దేవసభ సుధర్మ రోజుకన్నా మరింత నిండుగా వుంది. ముఖ్య సభ్యులందరూ ముందుగానే విచ్చేశారు. సభలకు ఆలస్యంగా వచ్చే సంప్రదాయం యింకా అక్కడికి వ్యాపించలేదు. అధిపతి ఇంద్రుడుకూడా సకాలానికే వచ్చాడంటే మన మర్త్యులు నమ్మరు. యముడు, అగ్నిహోత్రుడు, నారదుడు, శుక్రుడు, విశ్వామిత్రుడు, వసిష్ఠుడు ప్రభృతులు యథావిభవంగా హాజరై వున్నారు.

చర్చించుకోతగ్గ సమస్య లేవీవారికి కనిపించలేదు. ఉపన్యాసంపట్ల వ్యామోహంగల వాలఖిల్యుడు సత్యశీలాన్ని గురించి తైలధారలా మాట్లాడుతున్నాడు. అందులో కొత్తదేమీ లేదు. సభికులలో ఉత్సాహం తగ్గిపోతోంది. అది కనిపెట్టి ఇంద్రుడు ఆ ప్రసంగం మెచ్చుకొంటున్నట్లు సూచించడంకోసం "సాధు, సాధు" అన్నాడు.

ఈ ముక్క చెవిని పడడంతో వాలఖిల్యుడు మరింత శక్తి పుంజుకొని శ్రుతి హెచ్చించాడు. సభికులు పిచ్చాపాటిలో పడ్డారు, ఆ ముని అప్పుడే విరమించడని తెలుసుకొని.

పరిస్థితి బాగా గ్రహించి ఇంద్రుడు "మునివర్యా! ఈ కాలంలో అటువంటి సత్యసంధులు వున్నారా?' అని ప్రశ్నించాడు.

సభ యావత్తూ స్తంభించినట్లయింది. అంతా ఆశ్చర్యపోయి ఒకరివంక మరొకరు చూస్తున్నారు.

వాలఖిల్యుని ప్రసంగం హఠాత్తుగా నిలచిపోయింది. ఆ ప్రశ్నకు సమాధానం ఆయనకు తెలియదు.

అందరికళ్ళు వసిష్ఠునివైపు తిరిగాయి. ఆయన విశ్వామిత్రునివంక చూశాడు. ఇద్దరి మనస్సుల్లో స్మృతులు కదలాడి, పెదవులపై చిరునవ్వులు నదయాడాయి. సదస్యులిది గమనించి తమలోతాము నవ్వుకొన్నారు.

అయితే, ఇంద్రుని ప్రశ్న అలాగే వుండిపోయింది. తన ప్రశ్న మరోసారి వినిపించడం అవసరమేమోనని ఆయన భావించి "సత్యసంధులే కరువయ్యారన్న మాట?" అన్నాడు నిస్పృహ వ్యక్తం చేస్తున్నట్లు.

ఎవ్వరూ పెదవి కదలించకపోవడం బాగనిపించక వాలఖిల్యుడు "బ్రహ్మ మానస పుత్రులే ఇందుకు అర్హులు" అన్నాడు.

విశ్వామిత్రునికీ మాటలు అవమానకరంగా తోచాయి. వాలఖిల్యునకు వాగుడు తప్ప తెలివితేటలు శూన్యమని నిర్ధారణ చేసుకున్నాడు. అయినా తొందరపడలేదు.

తానే అర్హుడ నన్నందుకు లోలోపల ఆనందిస్తూ. నారదుడు ఇంద్రుణ్ణి వుద్దేశించి "సురనాథా! ఇటీవల నేనంతగా లోకసంచారం చేయడంలేదు. లోకాలన్నిటా కలహాలు విపరీతంగా వున్నాయి. మరికొంతకాలంవరకు నేను సంచరించవలసిన అగత్యం లేదు!" అనగానే సభ అంతా పెద్దగా నవ్వింది. ఇంద్రుడు కూడా నవ్వాడు.

నవ్విన తర్వాత ఏం చేయాలో ఎవరికీ తోచలేదు.

వసిష్ఠుడు కలుగచేసుకోకుండా వుండడమే మంచిదని మాట్లాడకుండా వూరుకున్నాడు.

ఇంద్రుడు విశ్వామిత్రుని వైపుచూసి "కుశికనందనులు తమ దివ్యదృష్టితో మా ప్రశ్నకు ప్రత్యుత్తరం యివ్వ సమర్థులు" అన్నాడు.

తన శక్తి సరిగ్గా తెలుసుకొని అందరికీ చాటి చెప్పినందుకు విశ్వామిత్రుడు సంతోషించాడు. ఒక విధంగా నారదాదులకీ మాట చెంపపెట్టు అని ఆయన అభిప్రాయం. ఇతరులకు కూడా అలాగే అనిపించకపోలేదు.

"దేవనాథా! ఈ విశ్వామిత్రుడు మీ విశ్వాసాన్నెన్నడూ వమ్ముచేయడు" అన్నాడు సగర్వంగా అందరి వంకా చూస్తూ.

వెంటనే పద్మాసనస్థుడై, కళ్ళు మూసుకొని దివ్యదృష్టి ప్రసరింపచేశాడు.

మర్త్యలోకం, పుణ్యస్థలి, భరత వర్షం కనుపించింది. అందులో పరమశివునకు ప్రీతిపాత్రమైన త్రిలింగ భూమి, కృష్ణవేణీతీరం, ఇంద్రకీలాద్రి పాదభాగాన వెలసిన విజయవాడ, పైగా న్యాయస్థానం. స్ఫురద్రూపియైన వ్యక్తి. పేరు సత్యమూర్తి. "దేవునిపేర ప్రమాణంచేసి అంతా నిజం చెబుతాను" అని ముక్త కంఠంతో వుద్ఘోషిస్తున్నాడు. ఈ దృశ్యం తిలకించిన విశ్వామిత్రుడు పట్టరాని సంతోషంతో, విజయగర్వంతో కళ్లు తెరిచాడు.

సభను కలయచూశాడు.

ఇంద్రునివైపు తిరిగి మందహాసం చేసి "సురనాథా! మీప్రశ్నకు సమాధానం దొరికింది. సత్యవ్రతుణ్ణి నేను కనులారా చూశాను. తన సత్యనిష్ఠను తానే స్వయంగా దైవసాక్షిగా ప్రకటించాడు. పైగా ఆ స్థలం సాధారణమైనదికాదు, న్యాయస్థానం. ఆ మర్త్యుని పేరుకూడా సత్యమూర్తి" అని చెప్పాడు.

విశ్వామిత్రుడు చెబుతున్న వివరాలు ఆలకిస్తున్న ఇంద్రుడు "సాధు, సాధు" అని హర్షం వ్యక్తం చేశాడు.

దానికి ఇంద్రుడు వుబ్బి తబ్బిబ్బులవడం తక్కిన వాళ్ళకు అంతగా నచ్చలేదు. కాని ఎవ్వరూ పైకి తేలకుండా గంభీరంగా వున్నారు. సమయం కోసం ఆగారు.

విశ్వామిత్రుడు మళ్లా అందుకున్నాడు: "అతడు మంచి వర్చస్సు కలవాడు. సాదుస్వభావం అతనిది. మనకు కావలసినవాడు, సత్యం పలికేవాడు. తాను పలికేదే నిజమని అతడే ఎలుగెత్తి చాటుతున్నాడు. ఇంక శంకలెందుకు? "

సభలో తన ధాటికి ఆగే వారెవరూ లేరన్నట్టు ధీమాతో మాట్లాడటం చాలామందికి చివుక్కు మనిపించింది.

ఈ చర్చ యిలా పేలవంగా జరగటం నారదుడికి ఏమీ నచ్చలేదు. అందులోనూ కలహభోజను దయ్యే! విశ్వామిత్రుడు ప్రదర్శించే దర్పంవల్ల కూడా కొంత బాధగా వుంది.

అందుచేత తానూ రంగంలోకి దిగటం అవసరమనిపించి, వసిష్ఠునివైపు తిరిగి "మునికుల శ్రేష్ఠా! ఏమంటావ్? ఒప్పుకుంటున్నావా?" అని గుచ్చి ప్రశ్నించాడు.

దాని అర్థం వసిష్ఠునికి పూర్తిగా తెలిసింది.

"ఈ కలికాలంలో - ముఖ్యంగా ఆ భూలోకంలో అటువంటి సత్య వాక్పరిపాలకులున్నారనడం నమ్మశక్యం కాకుండా వుంది, మరి గాధినందనుడు ఎవరో సత్యమూర్తిని చూశానంటున్నాడు!" అన్నాడు సందేహాల్ని కుప్పపోస్తూ.

తన మాటలంటే నిర్లక్ష్యం చూపుతున్నందుకు విశ్వామిత్రుడికి చిర్రెత్తుకొచ్చింది. నారదుణ్ణి కాని వసిష్ఠుణ్ణి కాని చూడకుండా "అమరనాథా! మీ సెలవైతే ఆ సత్యవ్రతుణ్ణి ఈ సభకే తీసుకొచ్చి సదస్యుల సందేహాలను నివృత్తిచేద్దాం" అన్నాడు.

తనను కూడా కలుపుకొని మాట్లాడటం నచ్చలేదు ఇంద్రుడికి. అదీగాక ఒక నరుణ్ణి మర్త్యలోకం నుంచి దేవసభకు తీసుకురావటమా అన్న శంక కూడా కలిగింది.

"మునీంద్రా! అదెలా సాధ్యం?" అని అడిగాడు, నారద వసిష్ఠుల కొక పాఠంకూడా చెప్పాలనుకుని విశ్వామిత్రుడు ఒక క్షణంపాటు ఆలోచించి-

"సురాధిపా! అతడు సామాన్యుడు కాదు. సద్గుణ సంపన్నుడు. సత్యసంధుడు. పైగా, అతణ్ణి ఈ లోకంలో శాశ్వతంగా వుంచబోవడం లేదు. సభికుల సందేహాలు తీర్చడం కోసం ఒక్కసారి సభలో ప్రవేశపెట్టి, తర్వాత తిరిగి భూలోకానికి పంపి వేద్దాం" అని చెప్పాడు.

ఇంద్రుడికిది సుసంగతంగానే తోచింది. ఎందుకైనా మంచిదని "ఇందుకు అగ్నిదేవులేమంటారు?" సలహా కోరాడు.

అంతా ఆలకిస్తూ కూర్చున్నాడేకాని ప్రశ్న తనపైకి వచ్చి పడుతుందనుకో లేదు. శుక్రాదులుండగా తననే ఎందుకడగాలో అవగతం కాలేదు. అయినా కోరినప్పుడు చెప్పకపోవడమేమని, "విశ్వామిత్ర మహర్షులు ప్రతిపాదించినప్పుడు దానిలో అసమంజసమనేది వుండడానికి వీలులేదు. ఇక్కడికి వచ్చే నరుడు సత్యశీలి. మనకు కావలసింది అదేగదా?" అంటూ విశ్వామిత్రుని వైపు చూచాడు.

"అవును." గట్టిగా చెప్పాడు విశ్వామిత్రుడు.

ఈ సంభాషణ శుక్రునికి రుచించినట్లు లేదు. ఆయన వునికిని ఎవరూ గుర్తించకపోవడంతో ముఖంలో కొంచెం కోపం గోచరిస్తోంది. అగ్ని దేవుడది కనిపెట్టి

"ఆచార్య సత్తముల అభిప్రాయమేమిటో వినగోరుతున్నాం" అని వినయంగా అన్నాడు.

దాదాపు నిర్ణయం జరిగాక తన అభిప్రాయం కావలసివచ్చిందా అనుకొని "అందులో అభ్యంతరమేమీ లేదు" అన్నాడు. శుక్రుడు ముక్తసరిగా.

వీటితో ఇంద్రుడు యిక అడ్డు చెప్పలేకపోయాడు. అటువంటి నరుణ్ణి చూడాలని ఆయనకీ అభిలాషగావుంది. వసిష్ఠుణ్ణి మరోసారి కదిపిచూద్దామనుకొని "తాపస గరిష్ఠులు ఈ విషయమై రూఢిగా చెప్పలేదు" అన్నాడు.

లేనిపోని పేచీల్లోకి దిగడం మంచిది కాదనుకొని, "నా సందేహం ముందే వ్యక్తం చేశాను. కాని ఆ సత్యవ్రతుణ్ణి మన సమక్షంలోకి తెస్తానంటున్నాడు. ఇక రెండో మాటకు తావెక్కడ? తీసుకు రమ్మనండి. పరీక్షిద్దాం" అని హుందాగా చెప్పాడు.

'అయితే అందుకు తగిన ఏర్పాటు జరిపించవచ్చు. విశ్వామిత్రా! అతణ్ణి తేవడంలో సహాయం కావాలంటే యమప్రభువున్నారు" అనటంతో అంతా పెద్దగా నవ్వారు.

"నేనైతే అతని ప్రాణాలు రప్పించగలను అతి సులభంగా" అన్నాడు యముడు ఆ నవ్వుల మధ్య.

"అంతపని చేయకు ప్రభూ!" నారదుడన్నాడు.

సత్యమూర్తిని దేవసభకు తీసుకురావడానికి నిర్ణయం జరిగిన మీదట ఏ విధంగా తీసుకరావాలి, ఎవరు వెళ్ళాలి అన్న అంశాలపై చర్చ జరిగింది. విశ్వామిత్రుడెలాగూ వెళ్ళక తప్పదు. లోక సంచారి కాబట్టి నారదుడు వెంట వుండటం వుపయోగకరమని మహర్షి కోరినప్పుడు ముందు కాసేపు భీష్మించినా చివరకు ఇంద్రాదులు కూడా అడిగిన మీదట సరేనన్నాడు నారదుడు.

ఈ భూలోక యాత్రకు కుబేరుని విమానం పుష్పకం ఎంతో అనుకూలంగా వుంటుందని ఏకగ్రీవంగా భావించారు. అతని సమ్మతికూడా పొందారు. "కాని, నిజంగా సత్యవ్రతుడైతేనే నా విమానంలో కాలు పెట్టగలుగుతా"దని హెచ్చరించాడు కుబేరుడు.

దేవసభ నిర్ణయం అమలుజరపడంలో ఆలస్యమేముంటుంది? నారద విశ్వామిత్రులు పుష్పకంపై భూలోకానికి బయలుదేరారు సత్యమూర్తి కోసం.

సత్యమూర్తి చరిత్ర సంక్షిప్తంగా తెలుసుకుందాం:

సత్యమూర్తి పేరు ఒక్క విజయవాడలోనేగాక దేశం యావత్తూ వ్యాపించింది. ఆడి తప్పనివాడు, దయాగుణానికి ఆటపట్టని పేరుపొందాడు, ఎప్పుడూ పుణ్యకార్యాలు చేస్తూనే వుంటాడు.

సత్యమూర్తి తండ్రి స్వర్గీయ పాపయ్య నిజంగా పుణ్యాత్ముడు. ఇద్దరు కొడుకులు. ఏరికోరి ధర్మరాజు, సత్యమూర్తి అని పేరు పెట్టాడు. పేరుకు తగ్గట్టు పెద్దవాణ్ణి ధర్మగుణం కలవాడుగాను, రెండోవాడిని సత్యగుణం కలవాడిగాను పెంచి

పెద్దచేసి నిశ్చింతగా కన్నుమూశాడు. పోతూపోతూ కొడుకులకు ధర్మం, సత్యం తప్పవద్దని చెప్పిపోయాడు.

ధర్మరాజు చాలా సాత్వికుడు, ఉమ్మడి ఆస్తి భారమంతా తమ్ముడికే అప్పగించేశాడు.

ధర్మరాజుకు ఒక్కడే కొడుకు నారాయణ. నారాయణ ఒక విధంగా చాలా దురదృష్టవంతుడు. అయిదేళ్ళు నిండకముందే తల్లిలేని బిడ్డ అయ్యాడు.

కంటికి రెప్పలా కాపాడుతూ వచ్చాడు కొడుకును ధర్మరాజు. సత్యమూర్తికి ఇద్దరాడపిల్లలు, ఇద్దరు మగపిల్లలు.

అన్నదమ్ముల వ్యాపారం నానాటికీ ఇబ్బడి ముబ్బడిగా లాభాలు చేసుకుంటోంది.

అన్నదమ్ముల మధ్య సామాన్యంగా ఎక్కడా కనుపించనంత అన్యోన్యత వుంది. వ్యాపారంలో ఎంత కలిసివచ్చినా సగం ఎప్పటికైనా పెద్దాయనకు పంచియివ్వక తప్పదుకదా అని సత్యమూర్తి భార్య సుగుణమ్మ చీటికి మాటికి భర్త చెవిని పడేస్తూనే వుంది. తల్లిదండ్రులే ముహూర్తాన ఆ పేరు పెట్టారో కాని - ఆమెలో సుగుణాలు తక్కువ. ఓర్వలేనితనం ఆవిడలో మూర్తీభవించింది.

అన్న ధర్మరాజు వ్యాపారంలో చెప్పుకోతగ్గ సహాయం ఏమీ చేయలేక పోయినప్పుడు ఆయనతో కలిసి వ్యాపారం చేయడ మెందుకని ఆమె పట్టుదల. చివరికి ఆమె పంతమే నెగ్గింది.

సత్యమూర్తికి ఏమాత్రం యిష్టం లేకపోయినా వాటాలు పంచుకోక తప్పిందికాదు. ఆనాడు అన్నను ఆలింగనం చేసుకొని చిన్నపిల్లవాడి మాదిరి సత్యమూర్తి ఏడుస్తుంటే పెద్దలంతా ముక్కుమీద వేలేసుకున్నారు. అందరి కళ్ళూ చెమ్మగిల్లాయి.

మనుషులంటే విడిపోయారు కాని వారి మనసులు, మమతలు మాత్రం మారలేదు. జరిగినదానికి యిద్దరూ లోలోపల వ్యధ చెందుతూనే వున్నారు.

ధర్మరాజు తన వాటా వ్యాపారం తమ్ముడికే అమ్మివేశాడు. పాతికవేలు పరిష్కారం చేశారు. అయితే, సత్యమూర్తి దగ్గర అంత పైకం లేదు. నోటు వ్రాసిస్తానన్నాడు. ఇంటిలో తన భాగం తాకట్టుగా వుంచుతానన్నాడు.

అసలే సగం దిగులుతో వున్న ధర్మరాజుకు తమ్ముని మాటలు మరింత బాధ పెట్టాయి. తండ్రి చెప్పిన వాక్యాలు తమ్మునికి గుర్తుచేసి, నోటిమాట కన్నా పవిత్రమైంది మరొకటి లేదని చెప్పాడు. వీలు చిక్కినప్పుడే సొమ్ము ఇవ్వవచ్చుని, తనకిప్పుడు అవసరం లేదని అన్నాడు.

అంతగా అవసరం లేని చరాస్తి అమ్మితే పదివేల రూపాయ లొచ్చాయి. ఇల్లు వుండనే వుంది. దాంతో కాలక్షేపం చేస్తున్నాడు.

భార్య మరణించినప్పటినుంచి ధర్మరాజు ఆరోగ్యం దెబ్బతింది. వాటాలు పడ్డాక మరింత కుంగిపోయాడు.

ఆయన పరిస్థితి చాలా క్షీణించింది. ఇక ఎక్కువకాలం జీవించనని తెలుసుకున్నమీదట తమ్ముణ్ణి పిలిచి పన్నెండేళ్ళ నారాయణను అప్పగించి "ఇకనుంచి నారాయణ నీ బిడ్డే" అన్నాడు కన్నీటిధారను బలవంతంగా ఆపుకుంటూ. మరదల్ని కూడా పిలిచి "సుగుణమ్మా! వీడు నీకు మరో కొడుకమ్మా." అని చెప్పాడు.

సత్యమూర్తి గుండె ద్రవించిపోయింది. ఏకధారగా కన్నీళ్ళు స్రవిస్తున్నాయి. రుద్ధమైన కంఠంతో అన్నకు హామీ యిచ్చాడు - "నారాయణను పెద్దచేసి ఆ పాతికవేలు వాడికప్పగిస్తాను."

డబ్బు గురించి తనకు విచారం లేదని ధర్మరాజు తమ్మునికి చెప్పాడు. తన చేతిలో మిగిలిన రొక్కం అయిదువేలు కూడా సత్యమూర్తికిచ్చాడు.

మరునాటి ఉదయం ధర్మరాజు దివంగతుడయ్యాడు.

తమ్ముడు సత్యమూర్తి యధావిధిగా కర్మకాండ జరిపాడు.

తల్లిదండ్రులులేని నారాయణ పినతండ్రి యింట్లో పెరుగుతున్నాడు.

సత్యమూర్తి నారాయణను కన్న కొడుకుకంటే ఎక్కువగా చూసుకుంటున్నాడు. సుగుణమ్మకిది సుతరామూ ఇష్టంలేదు. భర్త యింట్లో లేనప్పుడు నారాయణను అనేక విధాల యాతన పెడుతుంది. రకరకాలుగా తిడుతుంది.

నారాయణకివ్వవలసిన పైకం గురించి సత్యమూర్తి ఎప్పుడైనా భార్యతో ప్రస్తావిస్తే - "మీకేమైనా పిచ్చా, వెర్రా? రాతలా, కోతలా? ఏమీలేనిదానికి వృధాగా అంత సొమ్ము గంగలో గుమ్మరిస్తారా? కుర్రాడు పెరగడానికి ఖర్చు అవడం లేదా? మన నలుగురు పిల్లల్ని ఏమిచేస్తారు?" అని విరుచుకుపడేది. ఒక గంటసేపు ఈ ధోరణిలో బోధ చేసేది.

సత్యమూర్తి చాలా నొచ్చుకునేవాడు భార్య వైఖరికి.

వ్యాపారం బాగానే జరుగుతోంది. మరో నాలుగేళ్ళలో అన్న వాటాక్రింద యివ్వవలసిన పాతిక వేలు లాభం వచ్చింది. ఆ సొమ్ము విడిగా వుంచాడు. ఆ మొత్తం నారాయణపేర బ్యాంకులో వేస్తానంటే, భార్య సుగుణమ్మ పెద్ద గొడవ చేసిం[illegible]. తానూ, పిల్లలూ వురిపోసుకుంటామని బెదిరించింది. ఆమె అంతటి అఘాయిత్య[illegible] చేయగలదని కూడా సత్యమూర్తికి తెలుసు.

తనకు [illegible]యకుండా సత్యమూర్తి అలాంటి పనేమైనా చేస్తాడేమోనని సుగుణమ్మ ఎప్పటికప్పుడు గుమస్తాల ద్వారా లెక్కల పూర్తి ఆరాలు తీస్తూనే వుంది.

అసలు ఆ సొమ్ము గురించి మరిచిపొమ్మని, యివ్వనవసరంలేదని అనుకోమని భర్త చెవిని గూడుకట్టుకుని చెబుతోంది. అబద్ధమంటే వెరిచే సత్యమూర్తికి అది అన్యాయమనిపించింది.

దంపతుల మధ్య అప్పుడప్పుడు దీనిపైన రభస జరుగుతూనే వుంటోంది.

సత్యమూర్తి చాలా బాధపడుతున్నాడు. సుగుణమ్మ మనస్సు మారేవిధం తెలియక తనలో తాను విచారిస్తున్నాడు. అలా తలంచడం తప్పని ఎంతచెప్పినా సుగుణమ్మ ససేమిరా వినిపించుకోవడంలేదు.

బుద్ధి ఎరిగాక అబద్ధమాడని సత్యమూర్తికిదొక అగ్నిపరీక్ష అయింది. అయినా ఆయన మనస్సులో నారాయణకు అన్యాయం చేయాలన్న తలపు ఛాయామాత్రంగా నన్నాలేదు. సత్యమే తన జీవితానికి పరమ లక్ష్యం. ముక్తికి అదే మార్గమని సత్యమూర్తి విశ్వాసం.

ఒకనాడు సత్యమూర్తి కొట్టునుంచి యింటికి వచ్చి భోజనంచేసిన తర్వాత భార్యతో మాట్లాడుతుండగా ఆమె ముందుగా ఆ డబ్బుగొడవ లేవదీసింది. అనవసరంగా పెద్ద రాద్ధాంతం చేసింది. చచ్చిపోతానని అట్టహాసం చేసింది.

సత్యమూర్తి వేదన ఆమెకు అర్థంకాదు. ఆ రాత్రి సత్యమూర్తి ఆ సమస్య గురించి చాలాసేపు ఆలోచిస్తూ, ఆ ఆలోచనలు వూపిరి సలపకుండా ముసురుతుంటే అలిసిపోయి అలాగే నిద్రపోయాడు.

తన చేతుల్లో పెరిగిన నారాయణ ఈ వ్యవహారం కోర్టుకు తీసుకుపోవడం సత్యమూర్తికి ఆశ్చర్యం కలిగించలేదు. సుగుణమ్మ నైజం తెలిసిన నారాయణ తననుంచి సులభంగా సొమ్ము రాబట్టుకోవడం కష్టమని భావించి యిలా చేయక తప్పలేదని సత్యమూర్తి గ్రహించాడు. అయితే, యీ కేసులో నారాయణకు వీసమెత్తు కూడా బలం లేదని తన వకీలు చెప్పినా సత్యమూర్తికి ఆ మాటలు నచ్చలేదు. పైగా, కోర్టులో చెప్పమని ఆ వకీలు చెప్పిన మాటలు దారుణమైన అసత్యాలు.

సత్యమూర్తికి వెనుక నుయ్యి, ముందు గొయ్యిగా వుంది. కోర్టు బోనులో తన కప్పటికి ఎలాతోస్తే అలా చెబుతానని వకీలుతో అన్నాడు.

ఇంట్లో సుగుణమ్మతో మామూలు గొడవే మరింత తీవ్రస్థాయిలో జరిగింది.

సత్యమూర్తి న్యాయస్థానంలో ప్రవేశించి బోను ఎక్కాడు. ప్రమాణం స్వీకరించాడు. ఒక్కక్షణం కళ్లుమూసుకుని ఆలోచించాడు. నారాయణ దీనంగా కనిపించాడు. తనకు పరమధ్యేయమైన సత్యం పలకాలని నిశ్చయించుకున్నాడు. వెంటనే తన భార్య, నలుగురు పిల్లలు అంతా యింటిదూలాలకు వురిపోసుకొంటున్నట్లు కనుపించారు. కంగారుపడ్డాడు. అంతా అయోమయంగా వుంది. కళ్లు తెరిచి న్యాయమూర్తి వైపు ముఖం త్రిప్పి - సుగుణమ్మకు ఇష్టమైనవి, తన వకీలు చెప్పమన్నవి నాలుగు ముక్కలు గుక్క త్రిప్పుకోకుండా చెప్పి ఇవతలకు వచ్చేశాడు.

కేసు సులభంగా తేలిపోయింది. నారాయణకు ఆ డబ్బు ఇవ్వనవసరం లేదు....

అప్పటికే నారదుడు, విశ్వామిత్రుడు న్యాయస్థానం ఎదురుగా వున్న మైదానంలో పుష్పకం దింపిస్తున్నారు.

ఆ పుష్పక విమానం దిగటం చూసిన ప్రజలు తండోపతండాలుగా దానివైపు పరుగులు తీస్తున్నారు. సత్యమూర్తి కోర్టు భవనం బయటకు రాగానే విశ్వామిత్రు డతణ్ణి గుర్తించి, "నారదా! మనకు కావలసిన నరుడు ఇతడే. త్వరగా మన సంగతి చెప్పి ఒప్పించు. దేవసభకు తీసుకువెళ్ళి తిరిగి వెంటనే దిగపెడతామని చెప్పు. నీకు ఈ లోక వ్యవహారం నాకంటే బాగా తెలుసు" అన్నాడు.

వారిద్దరూ సత్యమూర్తి దగ్గరకు వెళ్లి అతనిని పుష్పకం వైపు తీసుకువస్తూ అన్ని సంగతులు వివరించారు.

సత్యమూర్తి ఆశ్చర్యానికి అంతులేదు. సత్యవ్రతానికి గల మహత్తు ఎలాంటిదో పూర్తిగా అర్థం చేసుకున్నాడు. ఆ మహర్షి ద్వయానికి సాగిలపడి మొక్కాడు. గుండె వ్రయ్యలయ్యేటట్లు విలపించాడు. అలా ఎందుకు రోదిస్తున్నాడో అర్థంగాక, దేవసభకు రావడానికి జంకుతున్నాడేమోనని ధైర్యం చెప్పి విమానం సమీపిస్తున్నారు.

కొంతదూరం నుంచి ప్రజలు ఈ అపూర్వ దృశ్యం చూస్తూ సంభ్రమాశ్చర్యాలలో మునిగిపోయారు.

సమీపిస్తున్న కొద్దీ పుష్పకం దూరంగా జరుగుతోంది. నారద విశ్వామిత్రులకు ఈ పరిణామం వింతగా తోచింది. వెంటనే కుబేరుని వాక్కు స్ఫురణకు వచ్చింది. కాని, దేవసభలో విశ్వమిత్రునకు తన దివ్యదృష్టిలో కొంతసేపుకు పూర్వమే సత్యమూర్తి కనుపించాడు. అతనిలో అసత్యదోషముంటే కనుపించే వాడుకాదు.

ఎందుకైనా మంచిదని, "ఆర్యా! ఈ న్యాయస్థానంలో మీరేమి పలికారు?" అని ప్రశ్నించారు.

సత్యమూర్తి దుఃఖస్వరంతో "మహానుభావా! నేను పాపిని. బుద్ధి ఎరిగిన మీదట మొదటిసారి అనృతం పలికాను" అని చెప్పేశాడు.

విశ్వామిత్రుడు కోపోద్రిక్తుడయ్యాడు. కాని, ఏమీ చేయదలచలేదు. తాను పరాజితుడయ్యాడు. నారదుని వెంటబెట్టుకొని పుష్పకం వైపు నడిచారు.

"నరుడా! నాకు నీవల్ల మరో పరాజయం కలిగింది. నీవు దేవసభకు వచ్చే అర్హత పోగొట్టుకున్నావు" అని సత్యమూర్తితో చెప్పాడు.

అందరూ తిలకిస్తుండగా నారద, విశ్వామిత్రులు పుష్పకంలో అతి వేగంగా పైకి ఎగిరిపోయారు.

సత్యమూర్తి గట్టిగా "స్వామీ! పుష్పకం. పుష్పకం!" అని అరుస్తున్నాడు.

తెల్లవారు ఝామున నిద్రలో అలా గట్టిగా కలవరిస్తున్న భర్తను లేపి "ఏమిటండీ, అలా పుష్పకం, పుష్పకం అని కేకలు పెడుతున్నారు?" అని గాభరాతో అడిగింది.

సత్యమూర్తి చెక్కిళ్ళు కన్నీటితో తడిసిపోయాయి. కొంతసేపటికిగాని తెప్పరిల్లలేక పోయాడు.

బాగా మెలుకువ తెచ్చుకొని, తనకు వచ్చిన దేవసభ, కోర్టు, పుష్పక విమానం కల గురించి సుగుణమ్మకు వివరంగా చెప్పాడు. క్రిందటి రాత్రి ఆమె పెద్ద గొడవ చేయడమే అందుకు కారణం కావచ్చునని చెప్పాడు. అభం, శుభం తెలియని చిన్నబిడ్డ, తమను నమ్ముకున్న నిర్మల హృదయుణ్ణి అలా అన్యాయం చేయడం మహాపాపం అన్నాడు.

నిజంలో వున్న గొప్పతనం, భర్త ఔదార్యం, మంచితనం ఆమెకు అర్థమయ్యాయి. తన మూర్ఖత తెలుసుకోగలిగింది. బయట వెలుగుతోబాటు ఆమె మనసులో కూడా కొత్త వెలుగు వచ్చింది.

భర్త పాదాలకు మొక్కి తన పాపాలను క్షమించమని పశ్చాతాపంతో కోరింది. "నీవు నారాయణను నీ బిడ్డల్లో ఒకడుగా చూసుకుంటేనే నీ పాపం పోతుంది" అన్నాడు.

అప్పుడే లేచి తన పక్కబట్టలు మడతపెట్టుకుంటున్న అమాయకుడు నారాయణను సుగుణమ్మ పిలిచి ఆప్యాయతతో దగ్గిర చేర్చుకుని, "బాబూ! ఇకనుంచి నీవు బట్టలు అలా మడతపెట్టుకో నవసరం లేదు. నీ కంచం నీవే కడుక్కోనవసరం లేదు. ఇవ్వాళ నుంచి నేను నీకు పిన్నిని కాదు, నీ అమ్మను!" అని ఆనందంతో అంది.

ఏమీ ఎరగని నారాయణ పినతల్లి మాటలు సరిగా బోధపడకపోయినా తానే అమ్మను అనగానే తల్లికోసం తపిస్తున్న అతని హృదయం పరవశించింది. ఆమె కాళ్ళను చుట్టివేసుకుని "అమ్మా, అమ్మా!" అని పట్టలేని సంతోషంతో వెక్కివెక్కి ఏడ్చాడు. అతని గుండె బరువు తీరింది.

ఈ దృశ్యం చూసి సత్యమూర్తి పొందిన అనుభూతి వర్ణించడానికి అలవికానిది.

సత్యమూర్తి సత్యవ్రతానికి ఇక ఆటంకాలేమీ లేవు.

*('ప్రగతి' సచిత్రవారపత్రిక - 11 సెప్టెంబర్, 1970)*